ప్రజాపక్షం నిరంతరం ప్రజల పక్షమే

-ఖమ్మంలో ప్రజాపక్షం వార్షికోత్సవ సంబురం



2లో

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శుక్రవారం | 23 | అక్టోబర్ | 2026

పేజీలు : 8

## కార్మిక అధికారి కార్యాలయంలో

# ఇష్టారాజ్యం






**ప్రజాపక్షం/ మధిర :** ఇక్కడ ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ కరువు. ప్రైవేటు వ్యక్తులు లేదా అధికారులు నియమించుకున్న ప్రైవేటు ఏజెంట్లు ఇక్కడ కార్యాలయానికి వచ్చి ఫైళ్లను చక్కబెడుతుంటారు. తమకు ఎవరైతే మాముళ్లు ఇచ్చారో వారి ఫైళ్లకు మాత్రమే కదిలే అర్హత ఉంటుంది. నిజమైన మిగతా 2లో..

-ఫైళ్లను పరిశీలిస్తున్న ప్రైవేటు వ్యక్తులు
-పైసలుంటేనే ఫైలు కదిలేది
-ఏజెంట్ల ద్వారా భారీ వసూళ్లు
-అసలైన లబ్దిదారులకు మొండిచేయి

## దేశానికి అసలైన వారసులు ఆదివాసీలే..



-మంత్రి సీతక్క
-ములకపాడులో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ
-లక్ష్మీ నగరం నుంచి ములకపాడు వరకు వేలాది మందితో భారీ ర్యాలీ

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** భారతదేశానికి అసలైన వారసులు ఆదివాసీలేనని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. గురువారం దుమ్ముగూడెం మండల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ములకపాడు సెంటర్‌లో ఏర్పాటు చేసిన అమరవీరుడు కొమరం భీమ్ విగ్రహాన్ని ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. భద్రాచలం ఎంఎల్‌ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, గిరిజన నాయకులతో కలిసి మంత్రి విగ్రహాన్ని, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆదివాసీ రాష్ట్ర నాయకుడు వీరయ్య గిరిజన జెండాను ఎగురవేశారు. అంతకుముందు లక్ష్మీ నగరం సెంటర్ నుంచి ములకపాడు వరకు వేలాది మంది ఆదివాసీలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆత్మగౌరవ నినాదాలు, మిగతా 2లో..

# ఇందిరమ్మ వివక్షపై భగ్గుమన్న విపక్షం



-ప్రజా పాలన కాదిది కాంగ్రెస్ పాలనే -కండువా కప్పుకుంటేనే అర్హుడా..?
-రాజకీయ వివక్షను మానుకోండి -వామపక్ష, బిఆర్ఎస్ నాయకులు
-ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా, ఆందోళన
-కలెక్టర్‌కు వినతి




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం చూపెడుతున్న రాజకీయ వివక్షపై విపక్షాలు భగ్గుమన్నాయి. వామపక్షాలు బిఆర్ఎస్ నేతృత్వంలో గురువారం భారీ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ధర్నాచౌక్‌లో ఎంఎల్‌సి తాతా మధు అధ్యక్షతన ఆందోళన కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు మాట్లాడుతూ రాజకీయ వివక్షను మానుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని అసలైన అర్హులకు ఇండ్లు దక్కే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఇందిరమ్మ గ్రామ కమిటీలను తక్షణం రద్దు చేయాలని లాటరీ పద్ధతిలో మిగతా 2లో..

# ఇందిరమ్మ వివక్షపై భగ్గుమన్న విపక్షం














**(మొదటిపేజీ తరువాయి)**
లబ్దిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ తదితర పార్టీల నేతృత్వంలో ఖమ్మం ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వివిధ పక్షాల నాయకులు మాట్లాడుతూ అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు దక్కడం లేదని ఎల్1, ఎల్2, ఎల్3 తో పాటు ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అధికార పార్టీ కార్యకర్తలకు ఇండ్లు కట్టబెడుతున్నారన్నారు. రాష్ట్ర మంత్రులు ఇందిరమ్మ ఇండ్లలో ఎటువంటి వివక్ష లేదని అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెబుతున్న మాటలకు గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలకు పొంతన లేదన్నారు. ఆచరణలో తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అధికార యంత్రాంగం సైతం అధికార పార్టీకి దాసోహం అంటూ క్యాంపు కార్యాలయాల్లో లబ్దిదారులను ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి ఖర్చు చేస్తున్న సొమ్ము కాంగ్రెస్ పార్టీదో , మంత్రులదో కాదని అది ప్రజా ధనమని ప్రజా ధనంపై అందరికీ హక్కు ఉంటుందని వారు స్పష్టం చేశారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 73, 74 రాజ్యాంగ సవరణ చేశారని దానిని కూడా కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కి సర్పంచులకు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో కనీస ప్రమేయం లేకుండా చేస్తుందని నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ వారే పన్ను కడుతున్నారా ఇతరులు పన్ను కట్టడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కండువ కప్పుకుంటేనే ఇండ్లు ఇస్తామన్నది సమాంజసం కాదని పద్దతి మార్చుకోకపోతే పతనం తప్పదని హెచ్చరించారు. పేదలందరికీ ఇండ్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం రాజకీయ వివక్షకు తావిచ్చి కాంగ్రెస్సేతర రాజకీయ పక్షాలలో ఉన్న వారికి ఇండ్లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని బోనకల్లు, కల్లూరు మండలం మర్లపాడులో ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిదర్శనమన్నారు. గతంలో పేదలను గుర్తించి లాటరీ పద్ధతిలో లబ్దిదారులను ఎంపిక చేసే వారని కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకుని తక్షణం ఇందిరమ్మ గ్రామ కమిటీలను రద్దు చేసి అర్హులను గుర్తించి లాటరీ పద్ధతిలో లబ్దిదారులుగా ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ గేటు వద్ద దాదాపు గంటసేపు బైఠాయించారు. జిల్లా నలుమూలల నుంచి వామపక్షాలు, బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేయడంతో పాటు జిల్లాలో నెలకొన్న పరిస్థితిని అర్హులకు జరుగుతున్న అన్యాయాన్ని కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎంఎల్‌సి తాతా మధు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌ఎలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, జెడ్పి మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య, సిపిఐ(ఎంఎల్)చంద్రన్న వర్గం నాయకులు సురేందర్, వివిధ పార్టీల నాయకులు మహ్మద్ మౌలానా, బెల్లం వేణుగోపాల్, బండి రమేష్, మాదినేని రమేష్, జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, ఆవుల అశోక్, జి. రామయ్య, శిరోమణి, ఝాన్సీ, లక్ష్మి నారాయణ, యర్రా శ్రీనివాసరావు, పగడాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# కార్మిక అధికారి కార్యాలయంలో ఇష్టారాజ్యం

**(మొదటిపేజీ తరువాయి)** లబ్దిదారులు ఏజెంట్లను ఆశ్రయించి ఎంతో కొంత ముట్టజెప్పకపోతే ఆ ఫైలు ఏళ్లు గడిచినా ముందుకు కదలదు. యథేచ్ఛగా కార్మిక శాఖ కార్యాలయానికి వచ్చిన ఫైళ్లను ప్రైవేటు వ్యక్తులు చక్కబెడుతున్నారంటే ఇక్కడి పనితీరు ఏ విధంగా ఉందో అవగతమవుతుంది. మధిర సహాయ కార్మిక శాఖాధికారి కార్యాలయం పైరవీలకు అడ్డాగా మారింది. అధికార యంత్రాంగమే పైరవీలను ప్రోత్సహిస్తుంది. కార్మిక శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన మొత్తాన్ని ఇచ్చేందుకు పెద్ద మొత్తంలో లంచాలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కార్మికుల నుంచి వచ్చిన దరఖాస్తులను ప్రైవేటు వ్యక్తులు పరిశీలిస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. లబ్దిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే మొత్తంలో సగ భాగం ఇక్కడ కార్యాలయంలో ఉన్న ప్రైవేటు వ్యక్తులే తీసుకుంటున్నారని దీనిలో అధికారులకు వాటాలను ముట్టజెబుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో కార్మిక శాఖ వద్ద రిజిస్ట్రేషన్ కానీ వ్యక్తులకు ఇన్సూరెన్స్‌ల పేరుతో మరణించిన తర్వాత పెద్ద మొత్తంలో ఇప్పించి చాలా మంది అరెస్టయ్యారు. దీనికి సంబంధించి అప్పుడు రాష్ట్రంలో సంచలనం చోటు చేసుకుంది. దాదాపు 100 మందిని పోలీసులు విచారించారు. అయినా మధిర కార్మిక శాఖ తీరు మారలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి. ఆసుపత్రుల్లో నర్సులుగా పనిచేస్తున్న వారిని వివిధ ప్రాంతాలలో వేరువేరు వృత్తుల్లో ఉన్న వారు ప్రమాదవ శాత్తు మరణిస్తే కార్మికులుగా చూపించి ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి లబ్ది చేకూర్చేందుకు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. కార్మికులు కానీ వారు అనేక మందిని అర్హులుగా గుర్తించి కార్మిక శాఖ గుర్తింపు కార్డులు అందజేస్తున్నారు. మధిర కార్యాలయం కేంద్రంగా దాదాపు 10 మందికి ఈ ఫైళ్లు పరిశీలించడం లబ్దిదారుల నుంచి నగదు వసూలు చేయడం వృత్తిగా మారింది. దీనిపై పూర్తి విచారణ జరిపి కార్మిక శాఖలో జరుగుతున్న అవకతవకలను అరికట్టడంతో పాటు నిజమైన లబ్దిదారులకు న్యాయం జరిగేలా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

### అవును మేమే పిలిపించాం : కార్మిక అధికారి

కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు ఫైళ్లు చక్కబెట్టడం లబ్దిదారుల జాబితాను తయారు చేయడానికి సంబంధించి ‘ప్రజాపక్షం’ దినపత్రిక మధిర సహాయ కార్మిక అధికారి రమేష్‌ను ప్రశ్నించగా మా వద్ద సిబ్బంది లేరు మేమే కొంత మంది వ్యక్తులను పిలిపించాం. వారు క్రమం తప్పకుండా మా కార్యాలయానికి వస్తుంటారు. ఇందులో తప్పేముంది అంటూ ప్రశ్నించారు. మేము కార్యాలయంలో లేనప్పుడు ఫైళ్లు పరిశీలిస్తే తప్పు కానీ మేము మా కార్యాలయంలో ఉన్నప్పుడు ఇతరులు వచ్చి ఫైళ్లు పరిశీలించడం తప్పు కాదంటూ సమాధానం ఇచ్చారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా ఇలా ప్రైవేటు వ్యక్తులు లబ్దిదారుల ఎంపిక జాబితాను పరిశీలిస్తారా అని ప్రశ్నించగా ఆ విషయం నాకు తెలియదు. మా వద్ద మాత్రం ఇలా జరుగుతుందంటూ ఆయన చెప్పుకొచ్చారు.

# ప్రజాపక్షం నిరంతరం ప్రజల పక్షమే

ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రజాపక్షం నిరంతరం ప్రజల పక్షమేనని ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తుందని ఖమ్మం ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు తెలిపారు. ‘ప్రజాపక్షం’ దినపత్రిక ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా ఖమ్మంలోని యూనిట్ కార్యాలయంలో గురువారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ‘ప్రజాపక్షం’ ముందు వరుసలో ఉందన్నారు. అన్ని రంగాలలో ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యలే ప్రజాపక్షంకు ఇతివృత్తాలని ఆయన తెలిపారు. గడిచిన ఎనిమిదేళ్లుగా ‘ప్రజాపక్షం’కు సహకరిస్తున్న ప్రకటన కర్తలు, పాఠకులు, అభిమానులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ‘ప్రజాపక్షం’ దినపత్రిక ఎడివిటి బాధ్యులు టికె ప్రసన్నన్, స్టాఫ్ రిపోర్టర్ ఆనంద్, ఖమ్మం ఇంచార్జి కె. ప్రసాదరావు, ఆర్‌సి ఇంచార్జిలు పి. కృష్ణార్జున్, బి. అశోక్, శ్రీకాంత్, పలువురు రిపోర్టర్లు పాల్గొన్నారు.

# దేశానికి అసలైన వారసులు ఆదివాసీలే..









**(మొదటిపేజీ తరువాయి)**
జై ఆదివాసీ, జై కొమరం భీమ్ నినాదాలతో మండల కేంద్రం మారుమోగింది.

### ఆదివాసీ హక్కుల పరిరక్షణకు కృషి

విగ్రహావిష్కరణ అనంతరం ములకపాడు ప్రభుత్వాసుపత్రి క్రీడా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణతో పాటు ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. భద్రాచలం ఎంఎల్‌ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీల సమస్యలపై అసెంబ్లీలో పోరాడతామని తెలిపారు. ప్రతి గిరిజనుడు తమ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని భవిష్యత్ తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహానీయుడు కొమరం భీమ్ అని కొనియాడుతూ, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

### జీవో నంబర్ 3పై స్పందించాలి

మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబురావు, మాజీ ఎంఎల్‌ఏ తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీవో నంబర్ 3 రద్దు అంశంపై గిరిజన ఎంఎల్‌ఏలందరూ స్పందించి ఆదివాసీ హక్కుల సాధనకు ఉద్యమించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కీలకమైన ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని మంత్రి సీతక్కను కోరారు. ఈసందర్భంగా ఆదివాసీ సమాజం తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని, కొమరం భీమ్ జీవితాన్ని, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీలు ఆత్మగౌరవంతో, స్వేచ్ఛగా జీవించాలనే లక్ష్యంతో కొమరం భీమ్ సాగించాలని పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన నినదించిన జల్ జంగల్ జమీన్ ఆదివాసీల హక్కులకు, జీవన విధానానికి, ప్రకృతితో వారి అనుబంధానికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు.

# హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 48వ జూనియర్ బాలికల అంతర్ జిల్లా హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్2026 పోస్టర్‌ను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్ గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్దార్ పటేల్ మైదానంలో అక్టోబర్ 31 నుంచి నవంబర్ రెండు వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ క్రీడాప్రాధికార సంస్థ (శాట్స్), డివైఎస్‌వో, ఒలింపిక్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించే ఈ టోర్నీ గ్రామీణ, పట్టణ ప్రాంత బాలికల క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు మంచి వేదికని, పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కృష్ణమోహన్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వరికుటి మోహన్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి



**వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మాట్లాడిన మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని సోమవరం రైతువేదికలో గురువారం ఖేత్ బచావో–కిసాన్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, భూసారాన్ని కాపాడుకునేందుకు తప్పనిసరిగా మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సూచించారు. నేల స్వభావం, భూసారం ఆధారంగా పంటల సాగు చేపట్టడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి(డిఎంవో) సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లకు సంబంధించి వివరాలను రైతులకు తెలియజేశారు. పిడి ఏటిఎంఎ సరిత రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. యాసంగి సీజన్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వరి, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా పెసర, మినుము వంటి అపరాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా పిడి ఏటిఎంఎ సరిత, డిఎంవో సంతోష్‌కుమార్, వైరా ఏడిఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఎంఏడి మయాన్ మయాన్ మంజుఖాన్, ఏవో(ఎఫ్‌టిసి) అరుణజ్యోతి, ఏవో(ఎస్‌టిఎల్) ప్రకాష్, ఏడి రామారావు, కెవికె శాస్త్రవేత్త ఫణిశ్రీ, వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, రైతు సంఘం నాయకుడు బొంతు రాంబాబు, కీర్తి, రైతులు చప్పిడి వెంకటేశ్వరరావు, జవ్వాజి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# శారీరక దారుఢ్య శిక్షణకు వసతులు కరువు



**ప్రజాపక్షం/మధిర:** త్వరలో జరగనున్న తెలంగాణ ఓలీస్ రిక్రూట్మెంట్ కోసం సిద్ధమవుతున్న మధిర యువతీ యువకులకు పట్టణంలో సరియైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. ఉద్యోగ అన్వేషనలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువకులు చివరి అవకాశంగా భావించి దేహదారుఢ్య శిక్షణకు స్థానికంగా ఉన్న అరకొర సౌకర్యాలతో నెట్టుకొస్తున్నారు. కొందరు పేద వర్గాలకు చెందిన యువకులు ఆర్థిక భారంతో దూర ప్రాంతాలకు వెళ్లలేక నానా అవస్థడు పడుతున్నారు. అదేవిధంగా శారీరక శ్రమలేక ఎంతో మంది ప్రజలు బిపి, షుగర్, హృద్రోగ సమస్యలతో రోగాల బారిన పడుతున్నారు. ప్రతిరోజు ఆహ్లాదకరమైన వాతావరణంలో శారీరక శ్రమతో కసరత్తులు చేస్తే ప్రజల ఆరోగ్యం మెరుగు పరచుకోవచ్చని డాక్టర్లు సైతం సలహా ఇస్తున్నారు. కాని మధిర పట్టణస్థులకు సరియైన వాకింగ్, రన్నింగ్ ట్రాక్‌లు ఫిజికల్ ఎక్సర్‌సైజులు కోసం వసతులు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గ కేంద్రంలో ఇలాంటి పరిస్థితి మారాల్సి ఉంది. పోలీస్ దేహ దారుఢ్య పరీక్షలకు సిద్ధపడే యువకులు సమయం తక్కువగా ఉన్నందున పరీక్షతో పాటు వ్యాయామ పరీక్షలో కూడా ఉత్తీర్ణత పొందడం ఎంతో కీలకం. కాబట్టి స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క దృష్టి సారించి తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని యువకులు, పట్టణస్తులు కోరుతున్నారు. అదేవిధంగా మున్సిపల్ అధికారులు, పట్టణ ప్రముఖులు బాధ్యతతో స్పందించి యువకుల శిక్షణకు జూనియర్, డిగ్రీ కాలేజీ వద్ద ఉన స్థలాన్ని తాత్కాలికంగా సిద్ధపరచవలసిందిగా కోరుతున్నారు.

# శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని మరోచోటుకు మార్చాలి



**నూతి సత్యనారాయణగౌడ్‌కు వినతిపత్రం అందజేసిన వైరా ఆర్యవైశ్యులు, సాయి మనికంఠ భక్త బృందం**

**ప్రజాపక్షం/వైరా:** వైరాలో శిథిలావస్థకు చేరిన ప్రస్తుత గ్రంథాలయాన్ని విద్యార్థులకు అనుకూలంగా మరో చోటుకు మార్చాలని కోరుతూ వైరా ఆర్యవైశ్య ప్రముఖులు, సాయి మణికంఠ భక్త బృందం సభ్యులు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. వైరా ఆర్యవైశ్య ప్రముఖులు రంగా జనార్ధన్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఖమ్మం జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్ నేతృత్వంలో పలువురు ఆర్యవైశ్యులు, సాయి మణికంఠ భక్త బృందం సభ్యులు నూతి సత్యనారాయణ గౌడ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ప్రస్తుతం ఉన్న గ్రంథాలయం శిధిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థిని, విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం గ్రంథాలయాన్ని సమీపంలోని కళాశాల స్థలానికి మార్చాలని కోరారు. అదేవిధంగా రోడ్డు విస్తరణలో శ్రీకోదండ రామాలయానికి సంబంధించిన స్థలం కోల్పోయిన నేపధ్యంలో, ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్నందున భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ నేపధ్యంలో ప్రస్తుతం గ్రంథాలయం ఉన్న స్థలాన్ని శ్రీ కోదండ రామాలయానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నూతి సత్యారాయణ గౌడ్ స్పందిస్తూ ఆర్యవైశ్యుల విజ్ఞప్తిని గౌరవ ఉప ముఖ్యమఖ్యమంత్రి మల్లు భట్విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చాఉ. గ్రంథాలయ స్థలాన్ని రామాలయానికి అప్పగించే అంశంపై సంబంధిత అధికారులతో చర్చించి ముందుకు తీసుకెళతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇంచార్జి ఆత్మకూరి శేషగిరిరావు, గజ్జల కృష్ణమూర్తి, లోకా వేణు, తాటికొండ రాము, వాణి, పెనుగొండ ఉపేంద్రరావు, అనుమోలు శ్రీనివాసరావు, బోనాల వెంకటేశ్వరరావు, కొణతం రాజారావు,చెరుకూరి వెంకటేశ్వరరావు, బజారయ్య, మైలవరపు శ్రీనివాసరావు, రమేష్, రంగ స్వర్ణ, నూకల అన్నపూర్ణ, గజ్జల మణి కుటుంబ సభ్యులు తాటిపల్లి శ్రీను, కృష్ణకుమారి, మాజేటి నాగసంధ్య, నాళ్ళ మాధవి, మిట్టపల్లి శ్రీనివాసరావు, ఉమా, గీత, నాళ్ళ మల్లేశ్వరి, తదితర ఆర్యవైశ్య ప్రముఖులు, సాయి మణికంఠ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్లిన నాయకులు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ మిత్ర పక్షాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన జిల్లా కలెక్టర్ ముట్టడి కార్యక్రమానికి ఎర్రుపాలెం నుండి పెద్ద ఎత్తున నాయకులు తరలివెళ్లారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన పేద బలహీన వర్గాలకు ఇవ్వాలని, ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. పేద ప్రజల న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈ ధర్నాను చేపట్టడం జరిగిందిన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీపాలశెట్టి తిరుపతిరావు, బొర్రా నర్సింహారావు, కోటా కోటేశ్వరరావు, చిత్తారు నాగేశ్వరరావు, యన్నంశెట్టి అప్పారావు, భాస్కర్‌రెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, రాయబారపు పుల్లారావు, కంచం గోపి, బొగ్గుల వీరారెడ్డి, ఆళ్ల నాగరాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 24న 'నీలవేణి' నాటక ప్రదర్శన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** గొల్లపూడి మారుతీరావు శ్రీనివాస్ దెంచనాల రచించిన 'నీలవేణి' నాటక నాల్గవ ప్రదర్శన ఈనెల 24న ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించనున్నారు. తెలుగులో ఆధునిక, ఆధునికాంతర నాటకాలను 40 ఏళ్లుగా ప్రదర్శిస్తున్న జానపదం, ఆధునిక సంచార నాటక రిపర్టరీ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఇవ్వనున్నారు. నీలవేణి నాటకం స్త్రీ, పురుషుల సంబంధాన్ని, ఘర్షణను సామాజిక సమానత్వాన్ని, ప్రేమకు, అధికారతత్వానికి ఉన్న నిరంతరతను, మోహానికి, మరణానికి ఉన్న తాత్వికతను చూపనుంది. జనపదం నాటక రిపర్టరీ ఇప్పటి వరకు శ్రీనివాస్ దెంచనాల దర్శకత్వంలో 65 నాటకాలను, మూడువేల ప్రదర్శనలు ఇచ్చింది. ఇప్పటి వరకు ఈ నాటకాలను 20 లక్షల మంది వీక్షించినట్లు సమాచారం. ఖమ్మం లో ప్రజా నాట్యమండలి, ఖమ్మం కళాపరిషత్ అన్నాబత్తుల కళా సంస్థ ఈ నాటక ప్రదర్శనను సంయుక్తంగా నిర్వహించనున్నాయి.

# నవంబర్22న ఆర్యవైశ్య వన సమారాధన



**ప్రజాపక్షం/మధిర:** ఆర్యవైశ్యుల ఐక్యత, ఆత్మీయత, సోదరభావాన్ని చాటిచెప్పేలా నవంబర్22న ఆదివారం అబ్బూరి వారి మామిడి తోటలో ఆర్యవైశ్య సామూహిక వన సమారాధన నిర్వహించాలని వాసవి ఆర్యవైశ్య వన సమారాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్ణయించడం జరిగింది. మధిర వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మారి దేవాలయంలో నిర్వహించిన వన సమారాధన సన్నాహక కమిటీ సమావేశంలో ఈ మేరకు సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆర్యవైశ్యులంతా ఒకచోట చేరి ఆత్మీయ అనుబంధాలను మరింత బలోపేతం చేసుకునేలా సామూహిక వన భోజన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమం ఆర్యవైశ్య కుటుంబాల మధ్య ఐకమత్యాన్ని పెంపొందిస్తూ పరస్పర స్నేహ బంధాలకు వేదికగా నిలవనుంది. ఈ సమావేవంలో మిర్యాల వెంకటరమణ గుప్తా, పల్లపోతు ప్రసాదరావు, చారుగుండ్ల నరసింహమూర్తి, కుంచం కృష్ణారావు, నంబూరు మురళి, దాచేపల్లి రాము, పల్లపోతు నరసింహరావు, నేరేళ్ల శ్రీనివాసరావు, చేడే రామకోటేశ్వరరావు, సముద్రాల పురుషోత్తం, కాజా చక్రధరరావు, కేతేపల్లి సురేష్, కాజా రమేష్ పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించి కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/వైరా:** కాంగ్రెస్ పార్టీ నాయకుడు తెల్లూరి వీరయ్య కుమార్తెల ఓణీల వేడుక వైరా మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక మిట్టపల్లి గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు రాంపూడి రోశయ్య, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి చిన్నారులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైరా కౌన్సిలర్లు రాచబంటి బలరామయ్య, బత్తుల సుమతి, ఏడుకొండలు, గోరంట్ల పిచ్చారావు తదితరులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

# టూవీలర్‌ను ఢీకొట్టిన కారు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు టూ వీలర్‌ను ఢీకొట్టిన సంఘటన ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 23వ వార్డులోని ఖమ్మంవరంగల్‌బైపాస్‌రోడ్డు వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం ఖమ్మం వైపు నుంచి వస్తున్న టూవీలర్‌ను ఆరెంపుల వైపుగా వస్తున్న కారు అతివేగంగా ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్ర గాయాలు కావడంతో రక్త స్రావం అయ్యింది. కాగా స్థానికులు సదరు గాయపడిని వ్యక్తిని హాస్పత్రికి తరలించారు. అయితే ఆ వ్యక్తి పరస్థితి సీరియస్‌గా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదం చేసిన కారు యజమాని ఆరెంపులలోని సాయి ఉమేష్‌గ్రానైట్ సంస్థ నిర్వాహకుడిగా తెలిసింది.

# కల్లూరు పట్టణంలో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ రంజాన్ బి




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని అత్యవసర సరుకులు ధరలు తగ్గించాలని తెలంగాణ వ్యవసాయ కార్యదర్శి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రంజాన్ బి డిమాండ్ చేశారు. గన్యా తండా, కల్లూరు పట్టణ పరిధిలో అంబేద్కర్ నగర్ శాంతినగర్ ప్రాంతాల్లో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని నిత్యవసర సరుకులు ధరలు పెరిగి పేదల ఇబ్బందులు పడుతున్నారని పనులు లేకపోవడం వల్ల సామాజిక బతకడం కష్టంగా మారిందని కూలీలకు వెంటనే ఉపాధిపనులు కల్పించి వారి నాదుకోవాలని రేషన్ షాపుల ద్వారా తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు ధరలు సబ్సిడీపై అందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుమిత్ర, బానోతు కృష్ణ, క్రాంతి కుమార్, బానోతు రమాదేవి, భానోత్ రంజిత్ కుమార్, బానోతు రాదా తదితరులు పాల్గొన్నారు.

# రైతు రుణాలను మాఫీ చేయాలి

**-ఆళ్లపల్లి, గుండాలను కరువు మండలాలుగా ప్రకటించాలి**
**-ఎన్నికల కమిషనర్ రాజీనామా చేసే వరకు ఉద్యమాలు కొనసాగిస్తాం**
**-సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ఎల్‌నీనో ప్రభావంతో పంటలు దిగుబడులు తగ్గి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆళ్లపల్లి, గుండాల మండాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, రైతుల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని కోరారు. అనిశెట్టిపల్లి నుంచి మార్కోడ్ వరకు డబుల్ రహదారి నిర్మించాలని, ఆళ్లపల్లి మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎల్‌నీనో ప్రభావంతో వ్యవసాయ రంగం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోందని సాబీర్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. పంటల దిగుబడులు తగ్గడంతో రైతులు పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో వ్యవసాయ పరిస్థితులను పరిశీలించి కరువు మండలాలుగా ప్రకటించాలని, రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మాఫీ చేసి ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులను గుర్తించి రైతులకు ఉపయోగపడే ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు. బీజేపీ అనుసరిస్తున్న మతతత్వ విధానాలను అడ్డుకోవాలని సాబీర్ పాషా అన్నారు. దేశంలో అన్ని కులాలు, మతాల ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛ కల్పించే పాలన అందించాలని కోరారు. మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించకుండా ప్రజాస్వామ్య, లౌకిక విలువలను పరిరక్షించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఎస్ఐఆర్‌ను



రద్దు చేసి, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా ఎన్నికల నిర్వహణ ఉండాలని అన్నారు. అనిశెట్టిపల్లి నుంచి మార్కోడ్ వరకు డబుల రహదారి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ఆసుపత్రిలో 24గంటల వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని, అవసరమైన వైద్య సిబ్బంది, సదుపాయాలు కల్పించి అత్యవసర సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో గుండాల మండల కార్యదర్శి వాగబోయిన రమేష్, మండల సహాయ కార్యదర్శులు ఎస్కె రహీం, వజ్జ పగడయ్య, ఊకే సమ్మయ్య, వజ్జ ఉమా, మచ్చ చిరంజీవి, తాటి ఎల్లయ్య, పరమ ఇమ్మానియేల్, నదీమ్, ఎల్లబోయిన నవీన్, ఆమీర్, శ్రీరామ్, సమ్మయ్య, బచ్చల రామయ్య, గుగ్గిల లక్ష్మి , వార్డు సభ్యులు, మండల నాయకులు, వివిధ గ్రామాల కార్యదర్శులు,పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

# మణుగూరు మున్సిపాలిటీ ముందు ప్రజా సమస్యలపై మహాధర్నా

**రేగా కాంతారావు పిలుపు**



**ప్రజాపక్షం/మణుగూరు:** బీఆర్ఎస్ పార్టీ హయాంలో మణుగూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం దాదాపు సుమారు రూ.75 కోట్ల నిధులతో తాగునీటి సౌకర్యాలు, సైడ్ డ్రైన్ల నిర్మాణం మహాత్ముల కాంస్య విగ్రహాల కోసం అంతర్గగత రహదారుల కో సం ఆహ్లాదకరమైన పార్కుల కోసం పబ్లిక్ జిమ్ ల కోసం సెంట్రల్ లైటింగ్ కోసం అనేక ప్రజావసరాల కోసం పనులు తీసుకువచ్చాం కానీ నేడు ఆ పనులను రద్దు చేయించి మణుగూరు అభివృద్ధిని అడ్డుకున్న ఘనత ప్రస్తుత ఎమ్మెల్యేకే దక్కుతుంది అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజలకు అవసరమైన పనులను ముందుకు తీసుకెళ్లాల్సింది పోయి, గతంలో మంజూరైన పనులను రద్దు చేయించడం ప్రస్తుత ఎమ్మెల్యే చేతగాని తనానికి నిదర్శనం అన్నారు. మున్సిపాలిటీకి ప్రజల సౌకర్యార్థం తీసుకువచ్చిన వైకుంఠ రథం నేడు మూలన పడిపోయింది అన్నారు. దాని టైర్లు, ఇంజన్లు అమ్ముకున్నారా అనే అనుమానం ప్రజలలో ఉంది లేకపోతే ఎందుకు నిరుపయోగంగా మార్చేసిన పరిస్థితి నెలకొంది అన్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన వాహనాన్ని సైతం కాపాడుకోలేని దుస్థితిలో మున్సిపల్ పాలన ఉండటం బాధాకరం దుర్మార్గం అన్నారు. మణుగూరు పట్టణంలోని సెంట్రల్ డివైడర్లపై పచ్చదనం కోసం బీఆర్ఎస్ హయాంలో అందంగా మొక్కలు నాటించాం అన్నారు. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే గెలిచిన వెంటనే వాటిని సైంటిఫిక్ రీజన్ లేకుండా తొలగించి కొత్తగా పూల మొక్కలు నాటించారు అన్నారు. వాటిని నాటిన రోజున నీళ్లు పోయడం మినహా, నేటివరకు వాటి నిర్వహణను పట్టించుకున్న నాథుడే లేదు అన్నారు. మొక్కలు పెరిగి రోడ్డుపై వెళ్లే వాహనదారుల ముఖాలకు తగిలి గాయాలు అవుచున్నా, వాటిని కత్తిరించి అందంగా ప్రజల సౌకర్యార్థం ఉంచాలి అనే కనీస బాధ్యత కూడా మున్సిపల్ అధికారులకు లేకపోవడం దురదృష్టకరం అన్నారు. బీఆర్ఎస్ హయాంలో మణుగూరు అభివృద్ధి కోసం తీసుకువచ్చిన నిధులు, ప్రారంభించిన పనులు, ప్రజలకు ఉపయోగపడే సౌకర్యాలు నేడు ఎందుకు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి అని ప్రశ్నించారు. మణుగూరు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేకు, మున్సిపల్ అధికారులకు ఉందన్నారు. ఈ సమస్యలన్నింటిపై ప్రభుత్వాన్ని, మున్సిపల్ అధికారులను నిలదీసేందుకు నేడు ఉదయం 9 గంటలకు మణుగూరు మున్సిపల్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించనున్నామని కావున మణుగూరు పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు ఉద్యోగులు విద్యార్థులు మేధావులు స్థానిక యువకులు, సహకరించవలసినదిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా కొమరం భీం జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేసిన కొమరం భీమ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆదివాసీ యువత ముందుకు సాగాలని జిఎస్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఆ సంఘం ఆధ్వర్యంలో పాల్వంచ కొమరం భీంవ హాల్‌లో కొమరం భీమ్ 125వ, జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులను, చట్టాలను, సంస్కృతి సాంరపదాయాలను పరిరక్షించుకోవటానికి ఆదివాసీ యువత ఐక్యంగా పోరాటం చేయాలన్నారు.యువత చదువులో, ముందుకు సాగుతూ రాజకీయ, ఆర్థిక, వ్యాపార, ఉద్యోగం తదితర రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మన హక్కులను కాపాడుకోవటం కోసం భవిష్యత్తులో బలమైన ఉద్యమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు సోయం సత్య



నారాయణ, ఆరెం ప్రశాంత్, మాజీ ఎంపిపి వర్స నారాయణ, తెల్ల ముత్తయ్య, పాయం రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి శస్త్ర చికిత్సకు రూ 20లక్షల ఎల్‌ఓసీ మంజూరు

**-మానవత్వం చాటుకున్న వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్**



**ప్రజాపక్షం/కారేపల్లి:** వినికిడి లోపంతో జన్మించిన చిన్నారి వైద్యానికి వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం కారేపల్లి మండలం కారేపల్లి గ్రామానికి చెందిన చింతల సందీప్ కుమారూ విశిక వెన్నెల శ్రీకి మెరుగైన వైద్యం, కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స కోసం రూ 20లక్షల విలువైన ఎల్‌ఓసీ లేఖను గురువారం వైరా క్యాంపు కార్యాలయంలో అందజేశారు. చిన్నారికి పుట్టుకతోనే వినికిడి లోపం ఉండటాన్ని గుర్తించిన తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగి, తమ స్థోమతకు మించి వైద్యం చేయించారు. తదుపరి శస్త్ర చికిత్సకు అధిక ఖర్చు అవసరం కావడంతో ఎంఎల్‌ఏను సంప్రదించారు. స్పందించిన ఆయన ప్రత్యేక చొరవతో రూ 20లక్షల ఎల్‌ఓసీ మంజూరుకు సహకరించారు. శస్త్ర చికిత్స అనంతరం చిన్నారిని జాగ్రత్తగా చూసుకోవాలని ఎంఎల్‌ఏ తల్లిదండ్రులకు సూచించారు. తమ కుమార్తె వైద్యానికి సహకరించిన ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అమృత్ సరోవర్ చెరువు వద్ద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం



**ప్రజాపక్షం/కారేపల్లి:** భారత ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని పెద్ద చెరువు అమృత్ సరోవర్ వద్ద గురువారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహింద్చరు. చెరువు పరిసరాలను శుభ్రం చేయడం, శ్రమదానం, మొక్కలు నాటడం, పరిసరాల అభివృద్ధి, నీటి వనరుల సంరక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. పరిశుభ్రమైన వాతావరణాన్ని కాపాడటంతో పాటు నీటి వనరులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని నిర్వాహకులు పేర్కొన్నారు. అదే విధంగా అప్పాయిగూడెం రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో ఎల్‌నీనో ప్రభావాలపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌నీనో కారణంగా వాతావరణంలో వచ్చే మార్పులు, వ్యవసాయంపై వాటి ప్రభావం, సాగులో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాల్సిన అవసరంపై రైతులకు వివరించారు. ఈకార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ దండు ప్రవీణ్, వ్యవసాయ అధికారి బట్టు అశోక్‌కుమార్, ఈసీ సుధీర్, ఏఈఓ మున్నీ, వార్డు సభ్యులు కుంజా కృష్ణ ప్రసాద్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బుట్టి శ్రీనుకు మేయర్ మూడు గణేష్ నివాళి



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సింగభూపాలెం గ్రామానికి చెందిన సిపిఐ నాయకుడు కీ.శే. బుట్టి శ్రీను దశదిన కర్మ కార్యక్రమానికి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుట్టి శ్రీను చిత్రపటానికి పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సుజాతనగర్ మండల కార్యదర్శి కోమారి వీర హనుమంతరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దస్రు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, యూసఫ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి తాళ్లూరి ధర్మారావు, ఏఐటీయూసీ సుజాతనగర్ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, సిపిఐ మండల నాయకులు జాన్ విక్టర్, పొదిల శ్రీను, బాబు, గోరంట్ల ధర్మ, బోడ రమేష్, బండి రమేష్, గడ్డం రాజేందర్, భూక్య కృష్ణ, మద్దెల పాపారావు, అమృత రావు, ఏసురత్నం, సర్వయ్య తదితరులు పాల్గొని బుట్టి శ్రీను చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

# ఘనంగా స్వేరోస్ వేడుకలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఎస్.ఆర్ శంకరన్ దేశంలో పేదలు, దళితులు, ఆదివాసీలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప ఐఏఎస్ అధికారి అని స్వేరోస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిని వీరయ్య అన్నారు. పట్టణ పరిధి సి కాలని గేటు ఎదురుగా స్వేరోస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రాష్ట్ర అధ్యక్షులు స్వేరోస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ జయంతిని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం సేస్ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే నినాదంతో ఎస్.ఆర్ ప్రవీన్ కుమార్ ఆలోచనల మేరకు 2012లో స్వేరోస్ నెట్ వర్క్ ఏర్పాటు అయిందని చెప్పారు. విద్యా ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని విశ్వసించిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్ళే లక్ష్యంతో స్వేరోస్ డేను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వేరోస్ నాయకులు ఐ. కుమార్, కొత్తపల్లి శ్రీను, రోహిత్ కుమార్, జిల్లా అధ్యక్షులు దుర్గా ప్రసాద్, రవీందర్, రవికిరణ్, శేషు, కిషోర్, నాగరాజు, సుభాని, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా సొసైటీ చైర్మన్ పీఠం దాసరి దానియేలుకు దక్కేనా!



ప్రజాపక్షం/వైరా: పదవులు ఆశించి పార్టీలు మారే నాయకులు ఎందరో...అధికారం ఉన్నా, లేకపోయినా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే నాయకుడు కొందరే! అలాంటి నాయకుల్లో దాసరి దానియేలు ఒకరని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకొని, రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా పార్టీని వీడకుండా కొనసాగుతున్న ఆయనకు ఇప్పటికైనా సముచిత గుర్తింపు దక్కాలనే డిమాండ్ వైరాలో వినిపిస్తుంది. వైరా సొసైటీ చైర్మన్ పదవిని సీనియర్ దళిత నాయకుడైన దాసరి దానియేలుకు కేటాయించాలని దళిత సంఘాలు, దళిత నాయకులు కోరుతున్నారు.

### బిఆర్ఎస్ హయాంలోనూ వెనక్కి తగ్గని నేత!

బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వైరా జెడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు నాయకులు ఆసక్తి చూపని పరిస్థితుల్లో దాసరి దానియేలు ముందుకొచ్చారని ఆయన అనుచరులు గుర్తుచేస్తున్నారు. పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని భావించి తన భార్యను ఎన్నికల బరిలో నిలిపి, అప్పటి అధికార పార్టీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ తరపున పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి ఎదురైనా పార్టీని వీడకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగారు. పదవుల కోసం కాకుండా పార్టీ కోసం నిలబడటమే తన రాజకీయ నిబద్ధతకు నిదర్శనమని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు.

### చిన్ననాటి నుంచి కాంగ్రెస్‌తోనే ప్రయాణం

దాసరి దానియేలు తన చిన్ననాటి నుంచే కాంగ్రెస్ పార్టీతో అనుబంధం కొనసాగిస్తూ, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీనియర్ నాయకుడిగడా గుర్తింపు పొందారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. 1995లో వార్డు మెంబర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన 20102012 మధ్య జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2013 నుంచి స్టేట్ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2021లో రెబ్బవరం సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో నాయకులు, కార్యకర్తలు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ముందుకు సాగారని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. పార్టీ కష్టకాలంలోనూ క్రమశిక్షణతో వ్యవహరించడం రాజకీయ ప్రయాణంలో ప్రత్యేకతగా పేర్కొంటున్నారు.

**-బిఆర్ఎస్ హయాంలోనూ కాంగ్రెస్ కోసం పోరాటం**
**-ఓటమి ఎదురైనా పార్టీని వీడని క్రమశిక్షణ కలిగిన నేత!**
**-నామినేటెడ్ పదవుల్లో ఎస్సీలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చేనా?**
**-సీనియర్ దళిత నాయకుడికి అవకాశం కల్పించాలని దళిత సంఘాల డిమాండ్**

### పదవులు ఖాళీ...ఆశావాహుల్లో చర్చ!

వైరా సొసైటీ చైర్మన్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవుల భర్తీ అంశం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో వైరా సొసైటీ చైర్మన్ పదవికి దాసరి దానియేలు పేరును పరిశీలించాలని ఆయన మద్దతుదారులు కోరుతున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, పార్టీ పట్ల విధేయత, ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తించి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన నాయకులకు గుర్తింపు లభించకపోతే కార్యకర్తల్లో నిరుత్సాహం ఏర్పడే అవకాశం ఉందని కాంగ్రెస్ శ్రేణుల్లోని కొందరు అభిప్రాయపడుతున్నారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన నాయకులను పదవుల కేటాయింపులో విస్మరించకూడదని వారు కోరుతున్నారు.

### ఎస్సీలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించరూ?

ఖమ్మం జిల్లాలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు గణనీయ సంఖ్యలో ఉన్నప్పటికీ, నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని దళిత సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పదవుల కేటాయింపులోను అదే స్ఫూర్తిని చాటాలని వారు కోరుతున్నారు. పార్టీ కష్టకాలంలోను కాంగ్రెస్‌ను వీడకుండా పనిచేసిన సీనియర్ దళిత నాయకుడు దాసరి దానియేలుకు ఇప్పుడు అవకాశం కల్పించకపోతే మరెప్పుడు కల్పిస్తారు? అని ఆయన మద్దతుదారులు ప్రశ్నిస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలో ఎస్సీ సామాజిక వర్గానికి ప్రాధాన్యతనిస్తూ వైరా సొసైటీ చైర్మన్ పదవిని దాసరి దానియేలుకు కేటాయించాలని దళిత సంఘాలు, దళిత నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### అధిష్టానం నిర్ణయంపై ఆసక్తి

మూడు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌తో కొనసాగుతున్న దాసరి దానియేలు సేవలు గుర్తించి సామాజిక న్యాయం దిశగా ఆయనకు అవకాశం కల్పించాలని ఆయన మద్దతుదారులు కోరుతున్నారు. వైరా సొసైటీ చైర్మన్ పదవి విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? సీనియర్ దళిత నాయకుడి అభ్యర్థనకు ప్రాధాన్యత ఇస్తుందా? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# మైసయ్య కుటుంబాన్ని పరామర్శించిన కందాళ





ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, శునక ప్రేమికుడు కనకం మైసయ్య మృతి పట్ల పాలేరు మాజీ ఎంఎల్ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మైసయ్య మృతి చెందగా, గురువారం కూసుమంచిలోని ఆయన నివాసానికి వెళ్లిన కందాళ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈసందర్భంగా మైసయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మైసయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆసిఫ్ పాషా, జిల్లా నాయకుడు మల్లిడి వెంకన్న, గురువాయిగూడెం సర్పంచ్ బానోత్ బిక్షం నాయక్, గంగాబండ తండా మాజీ సర్పంచ్ బానోతు కిషన్, దాసరి వెంకన్న, మండల నాయకుడు నలగాటి నాగయ్య, వార్డు సభ్యుడు చెరుకుపల్లి వీరయ్య, బెల్లంకొండ కిరణ్, బుచ్చిబాబు, వడిత్య బాలకృష్ణ, కనకం యాకుబ్ పాల్గొన్నారు.

# ఇల్లందు ప్యాసింజర్ రైలు పునరుద్ధరణకు హామీ

ప్రజాపక్షం/ఇల్లందు: ఇల్లందు ప్యాసింజర్ రైలును తిరిగి నడిపించడంతో పాటు రైల్వే స్టేషన్ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్యాసింజర్ రైలు సాధన కమిటీ ప్రతినిధులు గురువారం మహబూబాబాద్ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇల్లందు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా, ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. వారం, పది రోజుల్లో రైలు నడిచే అవకాశం ఉందని, ఇందుకోసం తాను ప్రయత్నిస్తున్నామని ఎంపీ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఇల్లందు ప్యాసింజర్ రైలు అంశంపై ఉన్నతాధికారులతో చర్చించినట్లు తెలిపారని వెల్లడించారు. రైలు పునరుద్దరణతో పాటు రైల్వే స్టేషన్ పునర్నిర్మాణంపై కూడా దృష్టి సారించాలని కమిటీ సభ్యులు కోరారు. ఈసందర్భంగా ఎంపీ పోరిక బలరాం నాయక్‌ను కమిటీ ప్రతినిధులు సన్మానించి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ప్యాసింజర్ రైలు సాధన కమిటీ కన్వీనర్ కంచర్ల శ్రీనివాసరావు, మానవ హక్కుల కమిషన్ జిల్లా కార్యదర్శి పంజాల వేణుగోపాల్,



ప్రైవేట్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకుడు గౌస్ పాషా, జిల్లా మైనార్టీ నాయకుడు కొండూరి రామచందర్, మాజీ కౌన్సిలర్ యాకుబ్ షావలి, ఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి, టీపీసీసీ సభ్యులు ఎస్‌కె జానీ పాషా, సిరాజ్, అవదుర్తి శంకర్, సురేష్, ప్రభునాథ్, కొడారి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన




ప్రజాపక్షం/పాల్వంచ : ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతంగా మారుతుందని దీనితో పాటుగా ఉత్పత్తి వ్యయం తగ్గి నాణ్యమైన పంటలు పండించే అవకాశాలు ఉంటాయని వ్యవసాయ విస్తరణ అధికారి జి. నగేష్ అన్నారు. మండల పరిధి పుల్లాయిగూడెంలోని రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయం వలన కలిగే ప్రయోజనాలను, అనుసరించాల్సిన సాగు పద్దతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహజ వ్యవసాయ క్షేత్ర పాఠశాల వాలంటీర్ ప్రశాంత్, జాతీయ మిషన్ సహజ వ్యవసాయం బ్లాక్ రిసోర్స్ కో ఆర్డినేటర్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ నీరుడు హేమలత, జాటోత్ శిల్ప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మినారాయణ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ హెచ్‌పి గ్యాసు మేనేజర్, డిప్యూటి తహశీల్దార్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని పద్మశాలి సంఘం జిల్లా కమిటి నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా ఎస్‌పి. బిరుదురాజు రోహిత్ రాజుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డిప్యూటి తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిజాయితీగా, నిభద్దతతో విధులు నిర్వహించిన అనంతుల లక్ష్మినారాయణ మృతి తీరని లోటన్నారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయనను బ్లాక్‌మేయిల్ చేసి మానసిక ఒత్తిడికి గురిచేసిన వారిని,ఆయన మృతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులైన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసు స్టేషన్ పనితీరును వివరించిన సిఐ



ప్రజాపక్షం/మణుగూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచనల మేరకు మణుగూరు డి ఎస్పీ వి. రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మణుగూరు పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు, బాధ్యతలు మరియు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర గురించి సి ఐ నాగబాబు వివరించారు. అలాగే పోలీస్ శాఖలో ఉపయోగించే వివిధ పరికరాలను విద్యార్థులకు చూపించి, వాటి పనితీరును వివరించారు.

# ఎంఎస్ పట్టా పొందిన డాక్టర్ లోహితకు అభినందనలు



ప్రజాపక్షం/వైరా: డాక్టర్ కాపా మురళీకృష్ణ,, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ దంపతుల కుమార్తె డాక్టర్ లోహిత చెన్నైలోని శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నుంచి ప్రసూతి, స్త్రీల వ్యాధుల విభాగంలో శస్త్ర చికిత్సలో పోస్టు గ్రాడ్యుయేషన్(ఎంఎస్) పట్టా పొందారు. వైద్య విద్యలో ఉన్నత విద్యను విజయవంతంగా పూర్తి చేసి ఎంఎస్ పట్టా సాధించిన డాక్టర్ లోహితను పలువురు అభినందిస్తున్నారు. ఆమె భవిష్యత్తులో వైద్య రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజలకు విశిష్ట వైద్య సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లోహితకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ ఆమె వృత్తి జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని, ఉజ్వల భవిష్యత్తులో ముందుకు సాగాలని శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇప్పటికే వైరాలో వైద్య విభాగంలో డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ గ్రామీణ ప్రాంత వైద్యులకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు.

# అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

### - గోవులను రవాణా చేస్తున్న వాహనం పట్టివేత

ప్రజాపక్షం/పాల్వంచ : గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ తోట నాగరాజు అన్నారు. పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం అర్థరాత్రి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం వైపు నుండి కొత్తగూడెం వెళుతున్న ఓ బొలేరో వాహనం అతి వేగంగా, అనుమానాస్పదంగా కనిపించినది. స్పంధించిన పోలీసులు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో పోలీసులు వాహనాన్ని నిలిపివేసి తనిఖీ చేశారు. గోవులను అక్రమంగా రవాణా చేస్తున్న తెలుసుకొన్నారు. వెంటనే వాహనాన్ని స్టేషన్‌కు, ఆవులను నవభారత్‌లోని గోశాలకు తరలించారు. లక్ష్మిదేవిపల్లి మండలం హోలియా తండాకు చెందిన వాహన డ్రైవర్ కొర్రా రాములు, కొత్తగూడెల ఓల్డ్ డిపో ప్రాంతానికి చెందిన ఫయాజ్ ఖురేషి, రెహాన్‌లపై కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

# స్వచ్ఛ ఆటో డ్రైవర్ శ్రీహరి మృతి బాధాకరం



**-కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటాం**
**-కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం**
**-బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి**
**-కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 58వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్ శ్రీహరి ఆకస్మిక మరణం తీవ్ర విచారకరమని, వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని కొత్తగూడెం నగర మేయర్ మూడ్ గణేష్ పేర్కొన్నారు. చుంచుపల్లి మండలం గాంధీ కాలనీ నివాసి, కార్పొరేషన్ స్వచ్ఛ ఆటో డ్రైవర్ కె. శ్రీహరి (38) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మేయర్ వెంటనే మృతుడి స్వగృహానికి చేరుకుని, పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజారోగ్యం కోసం శ్రమిస్తూ పారిశుద్ధ్య విభాగంలో సేవలందించిన నిబద్ధత కలిగిన కార్మికుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని, అకాల మరణం చెందిన శ్రీహరి కుటుంబాన్ని కార్పొరేషన్ తరపున ఆదుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతుడి భార్య, వృద్ధురాలైన తల్లిని పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని చెబుతూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గెద్దాడ నగేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, చుంచుపల్లి మండల సిపిఐ కార్యదర్శి వాసిరెడ్డి మురళి ఉన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా కార్మికుడి మృతిపట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

# డిసెంబర్‌లో ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర మహాసభలు

**-ఖమ్మంలో నేడు జరిగే సన్నాహక సమావేశానికి తరలిరండి**
**-మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర 3 వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి పిలుపునిచ్చారు. డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో ఖమ్మం నగరంలో ఈ రాష్ట్ర మహాసభలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనున్నాయని ఆమె తెలిపారు. ఈ మహాసభల విజయవంతం కోసం శుక్రవారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్లో మహాసభల ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సన్నాహక భేటీకి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది మహిళా సమాఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల మహిళా ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళల సమస్యల పరిష్కారానికి, హక్కుల రక్షణకు ఐక్య పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రాబోయే రాష్ట్ర మహాసభలకు సంబంధించి పక్కా కార్యాచరణను ఈ సమావేశంలో రూపొందించనున్నట్లు వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలి



ప్రజాపక్షం/కూసుమంచి: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిజమైన పేద లబ్ధిదారులకు న్యాయం చేయాలని, ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ వామ పక్ష పార్టీల నాయకులు గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను రద్దు చేయాలని, గ్రామ పంచాయితీల్లో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని నాయకులు కోరారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలని, అవసరమైతే లాటరీ పద్ధతిని అమలు చేసి ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కూసుమంచి మండలం నుంచి సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఓటు నమోదుపై అవగాహన కల్పించాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుపై ప్రతి గ్రామంలో విస్తృత అవగాహన కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన ఆయన, అర్హులైన పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు బాధ్యతతో కూడుకున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మన్నె కృష్ణారావు, సయ్యద్ మోహినుద్దీన్, కందరబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ చెక్కు అందచేత



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలం రాజుపాలెం సొసైటీ పరిధిలోని సికెసి రుణం పొందిన స్వర్ణ వెంకట నర్సింహా రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో నిబంధనల ప్రకారం మంజూరైన రూ.50 వేల ఇన్సూరెన్స్ చెక్కును సొసైటీ అధ్యక్షులు వెన్నపూస కృష్ణారెడ్డి వారి కుటుంబ సభ్యులకు అందచేశారు. గురు వారం ఎర్రుపాలెంలోని డిసిసిబి బ్యాంక్‌లో జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబాన్ని ఇన్సూరెన్ చెక్కును అందచేయగా కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం సొసైటీ సిఇఓ బూసిపల్లి వెంకటరెడ్డి, ఎర్రుపాలెం మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో ఏఐ పాత్ర..!

**-బిఎల్ఓలు, బిఎల్ఏలు ఉన్నా ఓట్ల తొలగింపు ఎలా...?**
**-ఓటు చోరీ ఆరోపణల్లో నిజమెంత....?**
**-ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో ఓట్ల తొలగింపుపై అనుమానాలు... బాధ్యత ఎవరిది...?**








ప్రజాపక్షం/ తల్లాడ : ఓటరు జాబితాలను ప్రక్షాళన చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత పాత్ర ఎంత..? బిఎల్ఓలు, బిఎల్ఏలు క్షేత్రస్థాయిలో అందుబాటులోఉన్నప్పటికీ ఓటర్ల పేర్లు తొలగించడానికి కారణాలేమిటి...? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.

### ఏఐ గుర్తిస్తే ఓటు తొలగించవచ్చా...?

ఓటరు జాబితాల్లో డబుల్ ఎంట్రీలు, మరణించిన వారి పేర్లు, చిరునామా మార్పులు వంటి అంశాలను గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుంది. అయితే ఏఐ గుర్తించిన సమాచారమే తుది నిర్ణయం కాకూడదు. ఒకే పేరుతో ఇద్దరు ఓటర్లు ఉండటం, చిరునామాల్లో, స్వల్ప తేడాలు కనిపించడం వంటి కారణాలతో అర్హులైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగించే అవకాశం ఉందా...? అనే అంశంపై స్పష్టత అవసరం. సాంకేతిక వ్యవస్థను ఉపయోగించినా ప్రతి కేసును నిబంధనల ప్రకారం ధృవీకరించడం కీలకం. రాజకీయ పార్టీల తరపున బూత్ స్థాయి ఏజెంట్లు, ఎన్నికల యంత్రాంగం తరపున బూత్ స్థాయి అధికారులు ఓటరు జాబితాల పరిశీలనలో కీలక పాత్ర పోషిస్తారు. అలాంటప్పుడు అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడితే ఆ ప్రక్రియలో ఎక్కడ లోపం జరిగిందనే ప్రశ్న తలెత్తుతుంది. క్షేత్రస్థాయిలో పరిశీలన సక్రమంగా జరిగిందా...? సంబంధిత ఓటర్లకు నోటీసులు ఇచ్చారా...? అభ్యంతరాలు స్వీకరించారా...?అనే అంశాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

### ఓటు చోరీ ఆరోపణల్లో నిజమెంత...?

ఓటర్ల పేర్లు తొలగించడంపై వస్తున్న ఆరోపణలను తేలికగా తీసుకోవడానికి వీల్లేదు. అదే సమయంలో ఆధారాలు లేకుండా ప్రతి తొలగింపును ఓటు చోరీగా పేర్కొనడం కూడా సమంజసం కాదు. ఉద్దేశపూర్వకంగా పేర్లు తొలగించారా...? లేక సాంకేతిక పరిపాలన లోపాల వల్ల జరిగిందా అన్నది వాస్తవాల ఆధారంగా నిర్ధారించాలి. తొలగించిన పేర్ల వివరాలు, కారణాలు, అభ్యంతరాల పరిష్కారం పునః పరిశీలన ఫలితాలను పారదర్శకంగా వెల్లడిస్తేనే అనుమానాలకు తెరపడుతుంది. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన హక్కు. అర్హుడైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చూడటం ఎన్నికల యంత్రాంగం బాధ్యత. ఎస్ఐఆర్ లో ఏఐ పాత్ర అధికారుల నిర్ణయాధికారం, బిఎల్ఓలు, బిఎల్ఏల పర్యవేక్షణ పై స్పష్టమైన వివరాలు అందుబాటులోకి రావాలి. అనుమానాలకు సమాధానాలు చెప్పడం, తప్పులు జరిగితే సరిదిద్దడం బాధిత ఓటర్లకు న్యాయం చేయడం ద్వారానే ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

### నిజాలు బయటపెట్టాల్సిన బాధ్యత ఎవరిది..?

ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయనే అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉంది. అదే సమయంలో ఆధారాలు లేకుండా ఓటు చోరీ జరిగిందని నిర్ధారించడం సరికాదు. తొలగించిన ఓట్లపై గణాంకాలు, కారణాలు, పునఃపరిశీలన వివరాలను పారదర్శకంగా వెల్లడిస్తేనే అసలు విషయం బయటపడుతుంది. ఓటరు పేరు తొలగించడం ఒక పరిపాలన ప్రక్రియ మాత్రమే కాదు. ప్రజాస్వామ్య హక్కుపై ప్రభావం చూపే అంశం. అందువల్ల డేటా సేకరణ నుంచి తుది జాబితా, ప్రచురణ వరకు ప్రతి దశలో జవాబుదారితనం ఉండాలి. ఓటరు హక్కును కాపాడటమే ఎన్నికల వ్యవస్థకు అసలైన పరీక్ష. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన కీలక హక్కు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడటం, తప్పులు జరిగితే సరిదిద్దటం, బాధ్యులపై నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకోవడం ఎన్నికల వ్యవస్థకు అత్యంత ముఖ్యం. ఓట్ల తొలగింపుపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసి ప్రతి ఓటరుకి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రశ్న ఒక్కటే ఓటరు జాబితాలో తప్పులు జరిగితే బాధ్యత ఎవరు..? ఆ తప్పుల వల్ల ఓటు హక్కు కోల్పోయిన వారికి న్యాయం ఎలా జరుగుతుంది...? ఈ ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ స్పష్టమైన సమాధానం చెప్పాలి.

# మహిళల్లో చైతన్యం పెంపొందించాలి




**- ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి**
**-తెలంగాణ రాష్ట్ర మహిళా సమైక్య మూడో మహాసభలను జయప్రదం చేయండి**

**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర మహిళా సమైక్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర మూడో మహాసభల విజయవంతం చేయాలని ఆ సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైరాలోని సిపిఐ కార్యాలయంలో యామాల సువార్త అధ్యక్షతన మహిళా సమైక్య వైరా మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన ఏపూరి లతాదేవి మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల చిన్నచూపు కొనసాగుతుందని, పురుషాధిపత్య ధోరణి మహిళల అభిబుద్ధికి ఆటంకంగా మారుతుందని అన్నారు. మహిళల్లో సామాజిక, రాజకీయ చైతన్యం పెరిగినప్పుడే వివక్షను ఎదుర్కొని తమ హక్కులను సాధించుకోగలరని పేర్కొన్నారు. మహిళలు సంఘటితమై అన్యాయాలు, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళా సమైక్య రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పోటు కళావతి, మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెరుకూరి సీతామహాలక్ష్మి, వైరా మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ, తాతా సరోజ, ముత్తా బాలమణి, షేక్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి

**తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన**



**ప్రజాపక్షం/కరకగూడెం:** ఆదివాసీ సమాజం భూమి, అడవి, నీటిపై హక్కుల కోసం నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అమర వీరుడు కొమురం భీమ్ పోరాట స్ఫూర్తితో నేటి ఆదివాసీ యువత, ఉద్యమ నాయకులు, ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలని తుడుందెబ్బ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ పిలుపునిచ్చారు. కొమురం భీమ్ జయంతి సందర్భంగా కరకగూడెం మండలం భట్టుపల్లి గ్రామంలోని కొమురం భీమ్ విగ్రహం వద్ద తుడుందెబ్బ మండల అధ్యక్షులు కలం సంపత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ కొమురం భీమ్ తన జీవితకాలంలో ఆదివాసీలు ఎదుర్కొన్న భూముల ఆక్రమణలు, అటవీ ఆంక్షలు, పశువుల మేతకు, కట్టెల సేకరణకు విధించిన పన్నులు, అధికారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆదివాసీల జీవన విధానాన్ని, సంప్రదాయ హక్కులను దెబ్బతీసే పరిస్థితులను ఎదుర్కొంటూ గోండు, కోయ తదితర ఆదివాసీ ప్రజలను సంఘటితం చేసి పోరాటానికి నాయకత్వం వహించారని తెలిపారు. ఆదిలాబాద్ ప్రాంతంలోని జోడేఘాట్‌ను కేంద్రంగా చేసుకొని సాగించిన ఆయన పోరాటం ఆదివాసీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. ఆదివాసీలకు వారి భూములపై హక్కులు కల్పించాలని, అటవీ అధికారుల వేధింపులను అరికట్టాలని, అన్యాయమైన పన్నులను తొలగించాలని కొమురం భీమ్ డిమాండ్ చేశారని వివరించారు. 1940లో జోడేఘాట్ ప్రాంతంలో నిజాం సైన్యంతో జరిగిన పోరాటంలో ఆయన అమరులయ్యారని తెలిపారు. ఆయన చాటిచెప్పిన "జల్‌జంగల్‌జమీన్" నినాదం నేటికీ ఆదివాసీ హక్కుల ఉద్యమాలకు స్ఫూర్తినిస్తోందన్నారు. కొమురం భీమ్ ఆశయాల సాధనలో యువత పాత్ర కీలకమనేటి ఆదివాసీ యువత కొమురం భీమ్ చరిత్రను తెలుసుకోవడంతోపాటు, ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన పెంచుకోవాలని వెంకటనారాయణ పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో సందేశాలు పెట్టడానికే పరిమితం కాకుండా గ్రామాల్లో ప్రజలను చైతన్యపరచాలని, భూముల ఆక్రమణలు, అటవీ హక్కుల సమస్యలు, చట్టాల అమలులో లోపాలపై ఆధారాలతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. యువత విద్య, చట్టపరమైన అవగాహన, సామాజిక బాధ్యతను పెంపొందించుకొని ఆదివాసీ సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామసభల్లో చురుకుగా పాల్గొంటూ, గ్రామస్థాయి సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో భట్టుపల్లి గ్రామపంచాయతి మాజీ సర్పంచ్ తోలేం నాగేశ్వరావు, తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కలం వేణుగోపాల్, ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక (జేఏసీ) కరకగూడెం మండల ప్రధాన కార్యదర్శి కలం సాంబమూర్తి, సోషల్ మీడియా కన్వీనర్ పోలేబోయిన సిద్దు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపే లక్ష్యం




**-గ్రామస్థాయిలో ముమ్మరంగా ఓటర్ల నమోదు చేపట్టాలి**
**-కాంగ్రెస్ నాయకుల పిలుపు**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల నియోజక వర్గ ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రఘునాథపాలెం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జి రాయల నాగేశ్వరరావు , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ లు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులందరిని ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను గ్రామ సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. ఈ నమోదు ప్రక్రియను నవంబర్ ఒటవ తేదీ నాటికి నూటికి నూరు శాతం విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టభద్రుల నమోదు కోసం రఘునాథపాలెం మండలంలో ఆరు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఈ ఎన్నికలను ఒక సవాలుగా స్వీకరించి క్షేత్రస్థాయిలో పార్టీ సత్తా చాటి రెండు ఎంఎల్‌సి స్థానాలను గెలిపించి ప్రజా ప్రభుత్వానికి కానుకగా ఇవ్వాలని వారు ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, వి.వెంకటాయపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు నల్లమల ఆనంద్, రఘునాథపాలెం మండల పార్టీ అధ్యక్షుడు కేలోత్ దేవ్ సింగ్, నాయకులు కొంటెముక్కుల నాగేశ్వరరావు, సర్పంచ్ సిద్దయ్య, భూక్యా సక్రి మంగిలాల్, భూక్యా చిన్నయ్య నాయక్, దరావత్ రామ్మూర్తి నాయక్, బానోత్ కోటేష్ నాయక్, జర్పుల శ్రీను, పాలెపు సత్యనారాయణ, చల్లగుండ్ల శ్రీనివాసరావు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఘనంగా అమిత్‌షా జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం:** కేంద్ర హోం మంత్రి, బిజేపీ అగ్రనేత అమిత్‌షా జన్మదిన వేడుకలను ఖమ్మం నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శ్రీ రక్ష హాస్పటల్ అధినేత, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవాసమితి ఛైర్మన్ మోత్కూరి నారాయణరావు, బిజెపి తెలంగాణ కార్యవర్గ సభ్యులు రుద్రప్రదీప్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మంద సరస్వతి, ఎస్ శ్రీ లక్ష్మి, అంకతి పాపారావు, కోరుకోండ ఖాదర్‌బాబు, గజ్జల శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పప్పు ధాన్యాల సాగుతో పంటల వైవిధ్యానికి ప్రోత్సాహం




**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి రైతు వేదికలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల మార్పిడి ప్రాధాన్యం, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగంపై వివరించారు. యాసంగి సీజన్‌లో వరి, మొక్కజొన్న సాగును తగ్గించి, తక్కువ కాలపరిమితి కలిగిన పప్పు ధాన్య పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి ఈ విధానం దోహదపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారి అరుణ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాలి



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి, పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. కొమరం భీమ్ విగ్రహావిష్కరణకు వచ్చిన మంత్రి సీతక్క, స్థానిక ఎంఎల్ఏ వెంకట్రావుకు ఈ మేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఎత్తిపోతల పథకం పూర్తయితే మండలంలోని అనేక మంది ఆదివాసీ రైతుల భూములకు సాగునీరు అందుతుందని, పంటలు సమృద్ధిగా పండే అవకాశం ఉంటుందని కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవినీతిని అరికట్టాలని, స్థానిక రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. తాళిపేరు ప్రాజెక్టు నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుని, రైతులకు రెండో పంట సాగుకు నీరు అందేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎలమంచి వంశీకృష్ణ, సరియం కోటేశ్వరరావు, మర్మం చంద్రయ్య, లక్ష్మీనగరం సర్పంచ్ సరియం రాజమ్మ, ప్రగల్లపల్లి సర్పంచ్ తుర్రం నవీన్‌కుమార్, అంజిబాక సర్పంచ్ కొమరం చంటి, ఎండీ బేగ్, కే గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# ఓట్లను కొనుగోలు చేసేవారు దేశద్రోహులు

**ఎమ్మెల్సీ అభ్యర్థి బ్రదర్ షఫీ**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** డబ్బుతో ఓట్లను కొనుగోలు చేయాలని చూసేవారు దేశద్రోహులని వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి, మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ షఫీ అన్నారు. గురువారం నేలకొండపల్లిలో ప్రచారం నిర్వహించి పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. నిరుద్యోగుల సమస్యలను మండలిలో వినిపించడంతో పాటు ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాన పార్టీలు భారీగా డబ్బు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నాయని ఆరోపిస్తూ, ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని కోరారు. గెలిచిన తర్వాతే ఇంటికి వెళ్తానని శపథం చేసినట్లు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు వచ్చే నెల 6వ తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహ్మద్ వాజిద్, షేక్ సత్తార్, షేక్ ఖాసింసాహెబ్, అమీరుద్దీన్, షేక్ రసూల్, దుడ్డెల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏరులై పారుతున్న గుడుంబా

**-చూసి చూడనట్టుగా ఎక్సైజ్ అధికారులు**

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండలంలో గుడుంబా అమ్మకాలు ఏరులై పారుతున్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తిప్పనపల్లి వీధిలో కాపు సారా తాగి పడిపోయిన వ్యక్తిని చూసి ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా తిప్పనపల్లి, తుంగారం, బెండాలపాడు, పోకలగూడెం, వెంకటియాతండా, అన్నారంతండా, బాలికుంట గ్రామాల్లో ఈ గుడుంబా అమ్మకాలు జోరుగా తయారు చేసి, ప్యాకెట్లల్లో ప్యాక్ చేసి రూ 50 చొప్పున అమ్ముతున్నా, ఎక్సైజ్ శాఖ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపాలని మహిళలు కోరుతున్నారు.

# సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యేకు వినతి

**రూ.6లక్షల నిధుల మంజూరుకు విజ్ఞప్తి**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిలిటీ పరిధిలోని 9వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సుమారు రూ.6లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు గుమ్మడిదల వెంకటనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డులో సిసిరోడ్ల నిర్మాణం అవసరాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సంబంధిత మున్సిపల్ ఏఈ శ్రీమాన్యను నిధుల మంజూరుకు అవసరమైన ఎస్టిమేట్లు(అంచనా వ్యయాలు) తయారు చేయాలని ఆదేశించారు. ఎస్టిమేట్లు సిద్ధం చేసి తదుపరి ప్రక్రియ చేపట్టేందుకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేయడంతో 9వ వార్డులో సిసి రోడ్లు నిర్మాణానికి మార్గం సుగమవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జిల్లా అభివృద్ధికి స్పష్టమైన లక్ష్యంతో పనిచేయాలి



ప్రజాపక్షం/ ఖమ్మం : జిల్లా అభివృద్ధి కోసం అన్ని శాఖలు స్పష్టమైన లక్ష్యంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షించారు. అధికారులు వివరించిన ప్రణాళికలను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి శాఖ స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. స్వల్పకాలిక లక్ష్యా

## -స్వల్పకాలిక లక్ష్యాలను ఆరు నెలల్లో పూర్తి చేయాలి

లను ఆరు నెలల్లో వంద శాతం సాధించేలా, మధ్యకాలిక లక్ష్యాలను ఏడాదిలో నెరవేర్చుకునేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ముఖ్యమైన పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన తెలిపారు. కార్యాచరణ సిద్ధమైన తర్వాత అవసరమైన కన్సల్టెన్సీ సేవలను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. వైద్య సేవలు మరింత మెరుగుపడాలని శిశు మరణాలు, మాతృ మరణాల రేటును తగ్గించేందుకు కృషి జరగాలన్నారు. పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం తగ్గించేందుకు ఒక ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతి అంశంపైన లక్ష్యాలు అమలు విధానం పర్యవేక్షణకు సంబంధించి వివరాలను సరైన పద్ధతిలో నమోదు చేయాలన్నారు. శిక్షణ, ఉపాధి, విద్యా ప్రమాణాల పెరుగుదల, నైపుణ్య శిక్షణ, వసతి గృహాల్లో తాగునీటి పరిస్థితి, పరిశ్రమలు, మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు, పట్టణాల్లో మౌలిక సదుపాయం, జనాభా పెరుగుదలకు అనుగుణంగా నివాసాల విస్తరణ, కొత్త కాలనీల ఏర్పాటు తదితర వాటిపై చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సిపిఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బెల్ట్‌షాపులకు ఎక్సైజ్ అధికారుల మౌనం సమ్మతమా...?



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలంలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా ఎక్సైజ్ అధికారులు వాటి నియంత్రణపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బెల్ట్‌షాపులపై తనిఖీలు నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గురువారం తల్లాడ మండల కేంద్రంలో వైరా ఎక్సైజ్ ఎస్ఐ వర్ని జిరెడ్డి ఆధ్వర్యంలో బెల్ట్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. తల్లాడ రింగు రోడ్డు సెంటర్‌లో ఉన్న షాపులో తనిఖీలు చేసే సమయంలో షాపులో కొందరు మందు తాగుతున్నప్పటికీ షాపులోకి వచ్చిన ఎస్ఐ కొన్ని సీసాలు చూసి అక్కడే పెట్టి వెళ్లిపోయారని పరిసరాలలో ఉన్న కొందరు వ్యక్తులు ఆరోపించారు. బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించిన సమయంలో మద్యం సీసాలు లభించినప్పటికీ వాటిని సీజ్ చేయకుండా వదిలేశారన్నారు. ముఖ్యంగా వైరా ఎక్సైజ్ అధికారిణి నిర్వహించిన తనిఖీల్లో మద్యం సీసాలు లభించినా స్వాధీనం చేసుకోలే

## -తల్లాడ మండలంలో తనిఖీల పేరుతో హడావుడి
## -చర్యలు శూన్యం



దని స్థానికులు పేర్కొన్నారు. తనిఖీల సమయంలో అక్రమ విక్రయాలు గుర్తించినప్పుడు నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా అధికారులు అనుసరిస్తున్న తీరుపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామస్తుల డిమాండ్ :**

తల్లాడ మండలంలో బెల్ట్‌షాపులపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. తనిఖీలను కేవలం హడావుడికే పరిమితం చేయకుండా నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించడంతో పాటు బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# యాసంగి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యతివ్వాలి

ప్రజాపక్షం/ముదిగొండ : ఎల్‌నినో ప్రభావంతో వర్షాపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు యాసంగి సాగులో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వరి, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా పెసర, కుసుమ వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యతివ్వాలని మండల వ్యవసాయ అధికారి వి.సాగేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని ముదిగొండ, మాదాపురం, పమ్మి రైతు వేదికల్లో జరిగిన కార్యక్రమాల్లో రైతులకు రైతునేస్తం కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. అందుబాటులో ఉన్న నీటివనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు పంట నష్టాల ముప్పును తగ్గించు కోవచ్చని తెలిపారు. రైతునేస్తం ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగుభూమి, భూసార పరిరక్షణ, పంటల ఎంపికపై అవగాహన కల్పించారు. పంటల సాగులో నేల ఆరోగ్యం కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు.



భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టడం వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో నేల సారవంతంగా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరావు, డైరెక్టర్లు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఏఈఓలు, మార్కెటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖమ్మం జిల్లాకి ఇవ్వాలి



ప్రజాపక్షం/ మధిర : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఖమ్మం జిల్లాలోని ఆర్యవైశ్యులకు కేటాయించాలని ఖమ్మం జిల్లా మహాసభ అధ్యక్షులు పసుమర్తి చందర్రావు, గౌరవాధ్యక్షులు వనమా వేణుగోపాలరావు, జిల్లా ఆర్యవైశ్య రాజకీయ విభాగం చైర్మన్ రంగా హనుమంతరావు, మండలాధ్యక్షులు చారుగుండ్ల నర్సింహమూర్తి విన్నవించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మధిర నియోజకవర్గ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మధిర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయాన్ని విచ్చేసిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ఆహ్వానించి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని జమ్మి చెట్టు దగ్గర భట్టి దంపతులు పూజలు నిర్వహించి విచ్చేసిన మధిర నియోజకవర్గ ప్రజలు భక్తులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భట్టికి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పదవికి ఖమ్మం జిల్లాలోని ఆర్యవైశ్యులను ఎంపిక చేయాలని కోరుతూ వినతిపత్రాన్నిఅందించేశారు. ఈకార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కాజా చక్రధర్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి కుంచం కృష్ణారావు, కళ్యాణ మండపం అధ్యక్షులు కురువెళ్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి నాళ్ల శ్రీనివాసరావు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన నిలిచిన పండుగ సాయన్న : కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం : పేదల పక్షాన నిలిచి అణగారిన వర్గాల కోసం పోరాడిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం పండుగ సాయన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా సాయన్న పోరాటం చేశారని పేదలకు దొరల ఆస్తులను పంపిణీ చేయడమే కాకుండా అధికార వ్యవస్థను సైతం ప్రశ్నించారన్నారు. తనదైన పాలన వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ప్రజల కోసం సాయన్న తన జీవితాన్ని అంకితం చేశారన్నారు.ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి. జ్యోతి, వివిధ సంఘాల నేతలు సంగమేశ్వరరావు, వెంకట నర్సయ్య, రావుల హన్మంతరావు, అనంతరాములు, తాటి వెంకటేశ్వరరావు, భద్రానాయక్, పిట్టల నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



ప్రజాపక్షం/ తల్లాడ : గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా అన్నారుగూడెం సర్పంచ్ గొట్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అన్నారుగూడెం నుంచి బిల్లిపాడు వెళ్లే రహదారి సమీపంలో పంచాయతీ సిబ్బంది మొక్కలు నాటారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో నింపేందుకు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నాటిన మొక్కలను సంరక్షిస్తూ వాటి ఎదుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కలెక్టరేట్ ధర్నాకు తరలిన బిఆర్ఎస్ నాయకులు



ప్రజాపక్షం/ తల్లాడ : అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే సర్పంచులకు వారి విధులు, అధికారాలను వినియోగించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో తల్లాడ మండలం నుండి అధిక సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు తరలి వెళ్లారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమన్నారు. వారికి కేటాయించిన విధులు, అధికారాలను స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు రెడ్యం వీర మోహన్‌రెడ్డి, కోటిరెడ్డి, దుగ్గిదేవర వెంకటలాల్, అన్నారుగూడెం సర్పంచు గొట్ల ప్రభాకర్, తల్లాడ ఉప సర్పంచ్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బ్రదర్ షఫీ



ప్రజాపక్షం/ముదిగొండ: 2027లో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న బ్రదర్ షఫీ పట్ట భద్రుల ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు గురువారం ఖమ్మం జిల్లా ముదిగొండ గ్రామంలోని పలువురు పట్టభద్రులను కలిసి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు ముందుగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. సమాజంలో విద్య, వైద్యం ప్రతీ ఒక్కరికీ ఉచితంగా, నాణ్యంగా అందుబాటులో ఉండాలన్నదే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల్లో సామాన్య ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాల్సినవసరం ఉందని అన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యావంతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు తగిన పరిష్కారాలు లభించడం లేదని బ్రదర్ షఫీ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టభద్రుల ఓటు నమోదు ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ పర్యటన చేపట్టిన నిర్వాహకులు తెలిపారు.

# కొత్తగూడెంలో ఘనంగా దుర్గామాత శోభాయాత్ర



ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 14, 15వ డివిజన్ కొత్తగూడెం గ్రామంలో దుర్గామాత శోభాయాత్ర కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో కన్నులపండుగగా నిర్వహించారు. కోలాట నృత్యాలతో పుర వీధుల్లో దుర్గామాత ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ మాట్లాడుతూ దేవీ నవరాత్రోత్సవాలు, బతుకమ్మ సంబరాలను అత్యంత కన్నులపండుగగా నిర్వహించినట్లు తెలిపారు. ఐక్యతకు, స్నేహబంధానికి పండుగలు ప్రతీకలుగా నిలుస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల హన్మంతరావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, బి. రామ్మూర్తి, శీతల సత్యం, పగడాల శ్రీను, పోతురాజు వెంకటేశ్వర్లు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.